# పరమార్థం

## ముక్తేవి భారతి

శాంతమ్మ మనసుని సమాధాన పరచుకోడానికి ప్రయత్నిస్తోంది. ఎంత ప్రయత్నించినా మనసుని వేధిస్తున్నదొక్కటే, జీవిత పరమార్థం ఇదికాదని.

శాంతమ్మ తులసికోట గుమ్మంలో కూచుని పత్తి విప్పుతోంది. ఉయ్యాలలో పిల్లాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. విసుక్కుంటూ లేచి పిల్లాడి నోట్లో పాలసీసా వుంచింది. 'ఇప్పటికి వినిపించిందా' రాఘవయ్య గదిలోనించి ముందు గదిలోకొచ్చాడు. 'ఆ–వినిపించింది. ఓ రామా లేదు, కృష్ణాలేదు' విసుగ్గా పత్తి విప్పుతూంది శాంతమ్మ.

అప్పుడే గడపలో అడుగుపెట్టిన కోడల్ని చూసి 'అప్పుడే వచ్చేవేమిటి?' అడిగాడు రాఘవయ్య.

'ఇంకా ముందురావాల్సినదాన్ని. బస్సు అందక.' ఉయ్యాల్లో పిల్లాడి దగ్గరకెళ్ళింది రాధ.

'పిల్లాడికి బాగాలేదనే మధ్యాహ్నం సెలవు యిచ్చి.వచ్చేసాను' ఉయ్యాల ఊపుతూ అత్తగారు వినేలా అంది రాధ.

*

రాధంటే శాంతమ్మకి చాలా యిష్టం. కూతురు ఫారిన్‌లో వుంది. ఏ నాలుగేళ్ళకో ఓసారి వచ్చి వెళ్ళిపోతుంది. తన ఇంట్లో లక్షణంగా తిరిగే కోడలును ఏనాడూ కోడలులా చూడలేదు శాంతమ్మ నిజానికి. కొడుకు, కోడలు నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటుంటే, కలసి సినిమాలకెడుతుంటే ఎంతో ఆనందపడేది శాంతమ్మ. రాధ స్నేహితులంతా అనేవారు 'ఒసేయ్ రాధా, అదృష్టం అంటే నీదేనే–భర్త ప్రేమగా చూడటంలో గొప్ప విశేషమేముంది! అత్తగారు ప్రేమగా చూడటంలోనే గొప్పంతా' అని. తల్లికి దూరంగా వున్నానని అనుకునేదేకాదు రాధ. కానీ ఈమధ్య పాలల్లో ఉప్పురాయిపడ్డట్టు నిర్మలమైన శాంతమ్మ మనసు ఎందుకో కలతచెందుతోంది.

ఆ రోజు రాత్రి రాధకి ఎంతకీ నిద్రపట్టలేదు. అటు ఇటు ఒత్తిగిల్లింది. చివరకి 'ఏమండీ' అని భర్తను లేపింది. 'ఊ' పక్కకు ఒత్తిగిల్లాడు రామం.

'అత్తగారెందుకో అదివరకులాలేరు – గిట్టనివాళ్ళు నా పైన ఏమైనా చెప్పారేమో – పిల్లాడిని కూడా అదివరకంత లాలనగా చూడడం లేదు.'

రామం నవ్వాడు. 'అర్థంలేని ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు. అమ్మ చాలా మంచిది. చెప్పుడుమాటలకి మారిపోదు'–రామం క్షణంలో మళ్ళా నిద్రలో మునిగిపోయాడు.

*

పక్కింటి పార్వతమ్మతో కలసి పొద్దున్న ఎనిమిదయ్యేసరికి గుడికి బయలుదేరింది శాంతమ్మ ఆ రోజు. 'అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి వెడుతున్నాను' గదిలో ముసలాయనకి, వంటింట్లో వున్న కోడలుకి వినబడేలా ఓ కేక పెట్టింది.

రాధకి ఏం చేయాలో తోచలేదు. తను ఆఫీసు కెళ్ళితే పిల్లాణ్ణి ఎవరు చూస్తారు? పాలు కలపడం,



పట్టడం మామగారికి రావు. తనకి ఇంక సెలవలు కూడా లేవు. రాధ మనసులో కొన్ని వందల సమస్యలు తల ఎత్తి నాట్యమాడాయి ఆ క్షణంలో.

*

గుళ్లో కూచున్న శాంతమ్మ అమ్మవారి విగ్రహంకేసే చూస్తోంది. ఎంత చక్కగా అలంకరించారు! ఇంతకాలం దైవచింతనకి తావు లేకుండా గడిపేసింది. ఓ వ్రతాలు, తీర్థయాత్రలు ఏవీ లేవు. కాని తను ఏ క్షణంలో కన్ను మూస్తుందో అప్పుడు తనవెంట వచ్చేవి ఏవీ — ఈ ఇల్లు, పిల్లలు, మేడలు, మిద్దెలూనా? కావే — తను చేసుకున్న పుణ్యమేదో అదే! శాంతమ్మ గడిచిపోయిన కాలాన్ని తల్చుకుని పశ్చాత్తాప పడింది. శాంతమ్మ అమ్మవారి విగ్రహాన్ని చూస్తూనే వుంది — కానీ నిశ్చలత కుదరటం లేదు — రాధమ్మ ఆఫీసుకి వెళ్ళి వుంటుంది, పని వాడు ఇప్పుడిప్పుడే పాకుతున్నాడు — గడపదాటి బయటికొచ్చేస్తే? ముసలాయన నిద్రపోతుంటే? శాంతమ్మ గుండె ఝల్లుమంది. ఇక గుడిలో కూచోలేక పోయింది. అయినా ఇంత నిశ్చలత లేకపోతే ఎలా — సమాధానపరచుకుని మళ్ళీ కూచుంది.

*

రాధ ఓ వారం రోజులు నానా ఇబ్బందిపడి పనిపిల్లని కుదిర్చింది - పిల్లాడిని ఎత్తుకోటానికి, ఆడించటానికి, పాలుపట్టడానికి, నిద్ర పుచ్చటానికీ. కాని ఇంట్లో రాధ, భర్త ఏదో చిరాకుగానే వుంటున్నారు — విసుగ్గా వుంటున్నారు. ఇంట్లో పనులన్నీ యాంత్రికంగానే జరిగిపోతున్నాయి. భోజనాల దగ్గర గంటలు గంటలు కబుర్లు చెప్పుకోటాలు, సినిమాలు, షికార్లు అన్నీ ఇంచుమించుగా తగ్గిపోయాయి. శాంతమ్మ అంతా గమనిస్తూనే వుంది. తను ఇంటి బాధ్యత పట్టించుకోడం పూర్తిగా తగ్గించేసింది — ఉంటే దేవాలయంలో, లేకపోతే చేతిలో భాగవతంతో మాత్రమే కనిపిస్తోందీ మధ్య. అవును మరి — తన పరమార్థం తను చూసుకోవద్దూ!

కాని శాంతమ్మ విషయం ఎవరూ ఇంట్లో పట్టించుకోటం లేదు. పిల్లాడిని ఎంతపనిలో వున్నా అత్తగారికి అందివ్వడం మానేసింది రాధ. ఆఫీసు విశేషాలు రకరకాలుగా రోజూ అమ్మకు చెప్పే రామం చాలా ముభావంగా వుంటున్నాడు. ముసలాయన మనుమడి సేవలో మునిగిపోయాడు.

శాంతమ్మ ఆ రోజు తను ఆ ఇంట్లో ఒంటరిదయిపోయినట్లు బాధపడింది మొదటిసారిగా. అయినా గుళ్ళు గోపురాలు తిరిగివస్తేనేనా వుంది భక్తి! ఏమో — ఇల్లంతా తనే అయి భర్తని, పిల్లల్ని సంతోషపరుస్తూ గడిపిన రోజులకన్నా ఇప్పుడు సాధించినదేమిటి — ఏమో — మానసిక సంఘర్షణలో పడి నలిగిపోయింది శాంతమ్మ. భాగవతంలో రెండు కన్నీటి బిందువులు జారి పడ్డాయి.

'శాంతమ్మా, శాంతమ్మా బయలుదేరు — ఊరేగింపు వస్తోంది — వెళ్ళాలనుకున్నాం కదూ' గోడవతల నుంచి పార్వతమ్మ కేక పెడుతోంది.

"ఒంట్లో బాగా లేదు—రాలేను ఒదినా"— శాంతమ్మ భాగవతం మూసేసి గదిలోకొచ్చింది.

ఆ రాత్రి శాంతమ్మకి ఎంతకీ నిద్రపట్టలేదు— లేచి మంచం మీద కూచుంది. ఏదో అశాంతి. తనకు తెలియకుండానే తన నుంచి ఏదో దూరమయిపోయినట్లు ఆవేదన. "ఏమండీ" నిద్రపోతున్న రాఘవయ్యను కదిపింది. "ఏమిటీ" రాఘవయ్య లేచి కూచున్నాడు. భార్య కళ్ళలోకి చూచాడు. కళ్ళలో ఎంతో దిగులు — పాపం, అనుకున్నాడు మనసులో—భార్యను చూస్తూ.

'మనసేమీ బాగా లేదండీ' శాంతమ్మ కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. రాఘవయ్య. క్షణం ఆగి—

'అదేమిటి—మనసు బాగుండకపోడం అంటే. అయినా శాంతా నీకేం బోల్డు పుణ్యం సంపాదిస్తున్నావుగా'—నెమ్మదిగా నవ్వాడు రాఘవయ్య.

ఆ నవ్వు శాంతమ్మ గుండెల్ని పిండివేసింది. ఇంతమందిని క్షోభపెడుతూ తను మూటకట్టే పుణ్యం ఎంతటిది? శాంతమ్మ శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది.

*

గుడిలో దేవుడి ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్దామనీ, పది రోజులుగా ఇల్లు కదలని శాంతమ్మని చూద్దామనీ వచ్చిన పార్వతమ్మ, ముందు గదిలో నవ్వుకుంటూ కబుర్లాడుకుంటున్న రాధని, రామాన్ని, దొడ్డి గుమ్మంలో మనుమణ్ణి ఒళ్ళో కూచోపెట్టుకుని ముసలాయనతో ముచ్చట్లాడుతున్న శాంతమ్మనీ చూసి 'ఎన్ని జన్మలెత్తినా ఈ శాంతమ్మకిక ముక్తి లేదు' అనిగొణుక్కుంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది మరుక్షణంలో. ❋

## పుస్తకాలు

### ఏది సత్యం? ఏదసత్యం?

[రచన: సి. ఆనందారామం; వెల రు. 7-50 పేజీలు 220; ప్రచురణ: న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ—2]

నిరుద్యోగి మౌళిని ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది కలవారి అమ్మాయి కళ్యాణి. ఎమ్. ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసైనా—అతనికి ఎక్కడా ఉద్యోగం దొరకదు. కళ్యాణి ఉద్యోగం చేసి తనను పోషిస్తుంటే భరించలేడు. చివరికి శ్రీపురం కాలేజీలో లెక్చరర్‌గా చేరతాడు. అక్కడ మౌళిని అనుమాన పిశాచం ఆవరించుకుంటుంది. ఆఖరులో కళ్యాణి మంచితనం అర్థమయ్యే సమయానికి ఆమె చావుబ్రతుకుల మధ్య వుంటుంది.

శ్రీపురంలో అందరికీ కళ్యాణి వేరే వుంటున్న విషయం తెలుసుగాని, మౌళికి మాత్రం తెలియదు.

"తాగటం వల్ల శారీరకంగా, ఆవేదనవల్ల మానసికంగా బలహీనమైన పురుషుణ్ణి నువ్వు మాత్రం స్వాధీనం చేసుకోలేవా? ఫ్రీగా నీకున్న శక్తులన్నీ వినియోగించి మౌళిని వశం చేసుకొని ఆయనను కాపాడు" అని స్నేహితురాలు సుమిత్రని భర్త దగ్గరికి పంపించే కళ్యాణి పాత్ర, 'అతి క్రూరంగా అణిచిపెట్టిన మౌళి మీద ప్రేమ ఇప్పుడు మనసంతా స్వేచ్ఛగా ఆక్రమించుకొని, అతని సంరక్షణలో, అతని సాహచర్యంలో ఆమెకు అపూర్వమైన సంతృప్తి కల్గుతుంటుంది' అనే సుమిత్ర పాత్ర; "అమ్మా! నామీద కరుణ చూపించండి. నా సేవలు అంగీకరించండి. మీరు నన్ను అనుగ్రహించేవరకూ మీ గుమ్మంలోనే పడి వుంటాను" అనే సరోజని పాత్ర — గల ఈ నవల చదవటం అయ్యాక పాఠకులలో ఒక ఆలోచన వస్తుంది — ఈ నవల పేరు "ఏది సహజం? ఏదసహజం?" అని పెడితే బాగుండేదని.